క్లుప్తంగా

మృత్యుంజయేశ్వరస్వామికి మండల పూజలు


పూజలు చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజ్‌లో నూతనంగా నిర్మించిన మృత్యుంజయేశ్వరుని స్వామివారికి మండల అభిషేక పూజలు చేశారు. ముందుగా కలశ స్థాపన, స్వామివారికి ప్రత్యేక హోమాలు, వేప, రావి చెట్లకు కల్యాణం చేశారు. అనంతరం స్వామివారికి మండల అభిషేకం చేశారు. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్టీసీ డిపో మేనేజర్ ముని చంద్ర, పసుపులేటి శ్రీనివాస్ కుమార్, ఎంఎస్ మన్యం, రోశయ్య, మురళి, లింగమూర్తి, కుప్పయ్య, శ్రీధర్, సునీల్, రామకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కీచకవధ


పరివార దేవతల గ్రామోత్సవం

ఏర్పేడు: మండలంలోని పాత వీరపురంలో జరుగుతున్న శ్రీకృష్ణ, ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కీచక వధ కార్యక్రమం భక్తులను అలరించింది. గ్రామంలో మేళతాళాలు మంగళ వాయిద్యాల మధ్య పరివార దేవతలను ఊరేగించారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముని రంగారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, పూజ రవి, బాలాజీ, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవకుల గోడు పట్టించుకోండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు గోడు పట్టించుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి వారు శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో జరిగే ఊరేగింపులు, గొడుగులు, దివిటీలు మోస్తూ సేవ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులు దక్షిణామూర్తి ఏజెన్సీ వారికి జీతభత్యాలు ఇవ్వడానికి సమ్మతించారన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా ఉచితంగా పనిచేసిన సేవకులకు జీతాలు వస్తే ఇప్పుడు వారి అనుమతి కాపీ ద్వారా వాని పేర్లు కాకుండా కొత్త వారిని చేర్చి, అన్యాయంగా మమ్మల్ని పక్కన పెట్టేస్తుంటే తామందరం కలిసి కోర్టును ఆశ్రయించారని, కోర్టు ఆదేశాల మేరకు జీతాలు ఇస్తామని చెప్పిన కార్యనిర్వాహణాధికారి, ప్రస్తుతం కోర్టు ఆదేశాలు బేఖాతారు చేస్తూ కొత్తవారికి సపోర్ట్ చేస్తూ డ్యూటీలు వేస్తున్నారన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి


వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

శ్రీకాళహస్తి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీలు భర్తీ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నేతలు కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి కొగిలి ముని చందు, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నగర నాయకులు బోస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు

సత్యవేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు. మంగళవారం దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో టీబి ముక్త భారత్ అభియాన్ వందరోజులు కార్యక్రమంపై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆగస్టు 23వ తేదీ వరకు టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయిస్తామన్నారు. క్షయ లక్షణాలు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చెన్నేరిలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సిబ్బంది బాలశిల, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాళహస్తి: బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు..మిట్టకండ్రిగ వద్ద రామలింగాపురం గ్రామానికి చెందిన రామచంద్రయ్య (59) వస్తుండగా పల్లెవెలుగు బస్సు ఢీకొంది. దీంతో రామచంద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారు.

కూటమి హామీలకు సమాధి

ఒకటి కాదు, రెండు కాదు.. సూపర్ సిక్స్ పేరుతో కొన్ని, మేనిఫెస్టోలో మరికొన్ని, ఎన్నికల ప్రచారంలో ఇంకొన్ని.. గత ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేస్తోందో వాటన్నింటికీ మరింత అదనంగా నిధులు ఇస్తామని కూటమి నేతలు అలవికాని హామీలు గుప్పించారు. అధికారం దక్కడంతో గద్దె నెక్కారు. అయితే మాటల్లో చెప్పిన హామీలు చేతల్లో అమలు చేసి చూపలేకపోతున్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా హామీల ఊసెత్తడం లేదు.

- మాయమాటలతో ప్రజలకు కుచ్చుటోపీ
- నియోజకవర్గంలో పేరుకుపోతున్న సమస్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


సత్యవేడులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు (ఫైల్)


ఛిద్రమైన కదూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్డు

వరదయ్యపాళెం : ఎన్నికల ప్రచారంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 20న సత్యవేడు గాంధీబొమ్మ కూడలిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభ్యర్థన మేరకు సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సత్యవేడు, దాసుకుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని మాట ఇచ్చారు. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలకు సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. దీనికి తోడు నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో గుప్పించిన హామీలపై ఏమాత్రం నోరు మెదపడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయింది. అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి చేసే బాధ్యత తనదంటూ స్వయాన ఎన్నికల సమయంలో సత్యవేడుకు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలతో నియోజకవర్గ ప్రజలను ఊరడించారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మబలికిన నియోజకవర్గ ప్రజలు ఆయన హామీలకు మొగ్గు చూపి స్థానిక టీడీపీ ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన ఆదిమూలంను గెలిపించారు. ఎమ్మెల్యే సైతం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పలు హామీలు ఇచ్చినప్పటికీ ఒకటి కూడా ఆచరణ నోచుకోలేదు.

అమలు కాని సూపర్ సిక్స్ హామీలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలు మాత్రం అమలు కాలేదు. నమ్మిన ప్రజలను నట్టేట ముంచడమంటే ఇదే. ప్రజలను ప్రలోభపెట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించే దశగా ముందుకు వెళుతున్నారు.

సమస్యలు ఇవే

- సత్యవేడులో ఉన్న సీహెచ్‌సీ 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి.
- సత్యవేడు ఇరుకురోడ్ల సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు నిర్మించాలి.
- గత ప్రభుత్వంలో మంజూరైన సత్యవేడు, నాగలాపురం మండలాల పరిధిలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం పూరి చేయాలి.
- సత్యవేడు కేంద్రంలో వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు నిర్మించాలి.
- బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, కోర్టు భవనం, సబ్ జైలు కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేయాలి.
- సత్యవేడు ప్రజల తాగునీటి అవసరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలి.
- గత ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- నియోజకవర్గంలోని 7 మండల కేంద్రాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- రైతులకు అవసరమైన తెలుగుగంగ ఉపకాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాలి. తాగునీటి చెరువులకు అభివృద్ధి పనులు చేపట్టాలి.
- ఆరణియార్ ప్రాజెక్ట్ ఆధునీకరణకు గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.
- నాగలాపురం నుంచి టీపీ కోటకు వెళ్లే రోడ్డు డబుల్ రోడ్డుగా మార్చాలి.
- బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే రోడ్డు కూడా డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలి.
- నాడు-నేడులో ఆగిపోయిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.
- నియోజకవర్గంలోని 7 మండలాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఈఏపీ ద్వారా 36 రోడ్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. అందులో 12 రోడ్ల నిర్మాణం పూర్తవ్వగా మరో 24 రోడ్లు పూర్తి కావాల్సి ఉంది.
- సత్యవేడు-కదూరు కూడలి, సత్యవేడు-ఊత్తుకోట ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా గుంతలమయమై వాహన రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఈ రెండు రోడ్లు అభివృద్ధి చెందాల్సి ఉంది.


సత్యవేడులోని తహసీల్దార్ కార్యాలయం


సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్


ఛిద్రమైన నాగలాపురం-టీపీ కోట రోడ్డు

నేడు వరదయ్యపాళెంలో వెన్నుపోటు దినం


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం వరదయ్యపాళెం మండల కేంద్రంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు తరలి రావాలని కోరారు. ఉదయం 10 గంటలకు వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలతో కలసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తహసీల్దార్‌కు సూపర్‌సిక్స్ మోసాలపై వినతిపత్రం అందజేస్తామన్నారు.

చెన్నంపల్లి మాజీ సర్పంచ్ మృతి


నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని చెన్నంపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తిరుమల అర్జున్‌రెడ్డి(74) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని అర్జున్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. మండలంలో సీనియర్ నాయకుడైన అర్జున్‌రెడ్డిని కోల్పోవటం దురదృష్టకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

పాట కచేరికి విచ్చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజానాట్యమండలి నేతలు

శ్రీకాళహస్తి: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూలు ఆవరణలో ఈ నెల 4వ తేదీన ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాట కచేరిని జయప్రదం చేయాలని ప్రజా నాట్యమండలి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి గెడి వేణు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాట కచేరి కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రమణ్యం పాటల గానగంధర్వుడే కాకుండా గొప్ప మానవతా, అభ్యుదయవాది అని వేణు కొనియాడారు. ఎస్పీబీకి శ్రీకాళహస్తితో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోనే జరిగిందని గుర్తు చేశారు. ఆయన జ్ఞాపకార్థం గానగంధర్వుడు జయంతి సందర్భంగా అదే పాఠశాలలో పాట కచేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కచేరి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు సాగుతుందన్నారు. ఓ వెంకటరమణ, కె.సెల్వరాజు, శాంతి, గురునాధం, సుబ్రమణ్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన


పంగూరులో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

ఏర్పేడు: తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి నిధులతో మండలంలోని పంగూరులో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. పంగూరులో తాగునీటి సమస్య నివారణకు ఎంపీ తన నిధుల నుంచి రూ.8లక్షలు మంజూరు చేయడంతో మంగళవారం ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. దళితవాడ శివారులో ప్రభుత్వ భూమిని మంగళవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, వీఆర్వో సుబ్రమణ్యం, సర్వేయర్ రంగారావు పరిశీలించారు. త్వరలోనే ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని వారు వెల్లడించారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

ఏర్పేడు: మండలంలోని సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాక్ పాయింట్ అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి ఏ. దయాకర్ వారికి మండలానికి వచ్చిన సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్ల వివరాలు తెలిపారు. మండల స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని పాఠశాలలకు బుధవారం నాటి నుంచి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పేడు ఉన్నత పాఠశాలలో మంజూరైన ఆటిజం సెంటర్‌ను రాష్ట్ర సహిత విద్య సలహాదారులు రామ్ కమల్, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ నాయుడు పరిశీలించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి సహిత విద్య ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు రమాదేవి, స్వర్ణలత పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

రేణిగుంట: మండలంలోని మామండూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌కు చెందిన గంగారం (78) మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 16వ తేదీ కరీంనగర్‌కు చెందిన గంగారం కుటుంబ సభ్యులతో తిరుమల దర్శనార్థం వచ్చారు. తిరుమలలో గంగారం తప్పిపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 19వ తేదీ రేణిగుంట మండలం మామండూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. మిస్సింగ్ కేస్ విచారణలో తిరుమలలో తప్పిపోయిన గంగారంగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం అతడి మృతదేహాన్ని రేణిగుంట పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నా భూమిని కాపాడండి

తొట్టంబేడు: తన భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి, తనకు ఇప్పించంచాలని సుమతి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. తొట్టంబేడు మండలంలోని పెద్ద కనపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 199/5లో 0.50 సెంట్లు భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి సుమతికి 1962 సంవత్సరం నుంచి పత్రాలున్నాయి. మొదటిగా అడపాల వీరాస్వామి వద్ద నుంచి ధర్మమ్మ కొనుగోలు చేసింది. ఆమె చనిపోయిన తరువాత కొడుకు రాజయ్య పేరును మార్చుకున్నాడు. ఆ రాజయ్య తన కుటుంబ అవసరాల నిమిత్తం ఏ. సుమతి అనే మహిళకు ఆ భూమిని విక్రయించాడు. ఇప్పుడు ఆ భూమి తనదంటూ కనపర్తి గ్రామానికి చెందిన చలపతి అనే వ్యక్తి ఆక్రమించుకుని, అడిగితే తనపై దౌర్జన్యం చేస్తున్నాడని సుమతి ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త జుంలేషా తండ్రి గౌస్ బాషా మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడకి చేరుకుని, మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు నాయకులు పఠాన్ ఫరీద్, గోరా, ఫజల్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని కూలిన విద్యుత్ స్తంభం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సూళ్లూరుపేట రోడ్డు మార్గంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. దీంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభానికి వైర్లు సైతం తెగిపోయాయి. దీని కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ చలపతి సంఘటనా స్థలానికి చేరుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యాంత్రీకరణతో అధిక లాభాలు


డ్రోన్ పనితీరును వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నారాయణవనం: వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక లాభాలు పొందవచ్చని పలువురు పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సదస్సులను రాజ్ కృషి విజ్ఞాన కేంద్రం మంగళవారం మండలంలోని నైనారుకండ్రిగ, నైనారుకండ్రిగల్లో నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సుధాకర్, భరత్‌కుమార్ రైతులకు మెరుగైన యాజమాన్య పద్ధతులు, సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని పంట సాగులో స్థిరమైన పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన ఉంటే అధిక దిగుబడులను పొందవచ్చని అన్నారు. ముఖ్యంగా పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వినియోగించుకోవాలన్నారు. 50 శాతం సబ్సిడీతో జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పుత్తూరు ఏడీ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురళి, పశువైద్యాధికారి కుమార్, ఉద్యా వనాధికారి వెంకట సౌజన్య, వ్యవసాయ సహాయకులు మోహన్ రాజా, నందిని పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో సెక్యూరిటీ గార్డు మృతి


ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మూర్ఛవ్యాధితో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలత్తూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఆలత్తూరుకు చెందిన సాంబయ్య (42) అదే గ్రామ పరిధిలోని శ్రీనిధిరాజ అట్టల పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా సోమవారం విధులకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం 2 గంటలకు డ్యూటీ ముగించుకున్నాడు. ఆరోగ్యం కాస్త నీరసంగా ఉండడంతో అక్కడే గదిలో విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో ఆయన మూర్ఛకు గురై అస్వస్థతకు లోనయ్యాడు. దీంతో సహచర ఉద్యోగులు శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సాంబయ్య మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు పరిశ్రమ వద్దకు చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. అయితే ఆయన మృతిపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ శవంతో పాటు పరిశ్రమ వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారుల తో చర్చించారు. పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు.

నేటి నుంచి రాజగోపుర కలశ ప్రతిష్ట

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ పంచాహ్నిక నూతన రాజగోపుర కలశ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకులు నాగమురగప్ప మొదలి తెలిపారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బుధవారం అంకురార్పణ, కలశ స్థాపన, గురువారం శ్రీ సుబ్రమణ్యస్వామి మూలమంత్ర సహిత ఏకాదశ రుద్రహోమం, గురు మండల హోమం జరుగుతుందన్నారు. అలాగే 6వ తేదీన కుజగ్రహ మండల హోమం, నవనాగ మండల హోమం, 7వ తేదీన మహామృత్యుంజయ పాశుపత హోమం, పుష్పారివాసం, 8వ తేదీ ఆదివారం రాజగోపుర కలశ ప్రతిష్ట, మహాకుంబాభిషేకం, గ్రామోత్సవం వైభవంగా జరుగుతాయని తెలిపారు.

ఘనంగా బంగారమ్మ జాతర


విశేషాలంకరణలో బంగారమ్మ


బంగారమ్మకు సారె తీసుకువస్తున్న మాజీఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో ఉన్న బంగారమ్మ ఆలయంలో మంగళవారం జాతర ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ జలాలు, కలశ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అంబలి పంపిణీ చేశారు. ఉదయం 9 గంటలకు గెరిగ ఉత్సవం ప్రారంభించారు. పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మైలు ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు వేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే సారె

బంగారమ్మ జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారె సమర్పించారు. వారికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు పట్టువస్త్రాలను స్వీకరించి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వనమాల నాయుడు, భాస్కర్‌రెడ్డి, మాధవనాయుడు, జగన్నాథనాయుడు, లీలామోహన్, లోకేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాధన మున్నారాయల్, ఆవుల శ్రీనివాసులు, సురేష్, శివయాదవ్, పులి రామచంద్రయ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.